క్లుప్తంగా

చెక్కుల పంపిణీ

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపూడి గ్రామంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫారసు మేరకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధిత కుటుంబాలకు మార్కెట్ కమిటీ చైర్మన్ వై.హనుమంతురావు అందించారు. ఈ కార్యక్రమంలో మండల సమన్వయ కమిటీ కన్వీనర్ వాంకుడోత్ దీప్లానాయక్, ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల వెంకటేశ్వర్లు, నాయకులు జోనబోయిన పాపయ్య, కోటీరు నర్సిరెడ్డి, ఎర్ర కరుణాకర్ రెడ్డి, గుండ్ల గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

మెగా బ్లాక్ ప్లాంటేషన్ ప్రారంభం

నేలకొండపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఏర్పాటు చేయనున్న మెగా బ్లాక్ ప్లాంటేషన్‌ను శనివారం ఎంపీడీఓ ఎం.యర్రయ్య ప్రారంభించారు. మండలంలోని అప్పలనరసింహాపురంలో 'ఉపాధి'నుంచి మంజూరైన రూ.16లక్షలతో నాలుగు ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఆరు వేల మొక్కలను నాటేందుకు కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఎంపీడీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వి.వెంకటేశ్వర్లు, ఎంపీఓ శివ, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ జానకిరామయ్య, ఈజీఎస్ ఏపీఓ ఆర్.సునీత, ఈసీ శేషగిరిరావు, కార్యదర్శి ఇబ్రహీం, టీ.ఏ. గోపి, క్షేత్ర సహాయకుడు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

28న 'ఆనందో బ్రహ్మ'

ఖమ్మంగాంధీచౌక్: మొగిలి ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆధ్వర్యాన ఈనెల 28వ తేదీ సాయంత్రం ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో 'ఆనందో బ్రహ్మ'పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నామవరపు కాంతేశ్వరరావు, జల్లా లక్ష్మీనారాయణ, మొగిలి గుణకర్ తెలిపారు. ఈ సందర్భంగా టీవీ, సినిమా కళాకారులు పాల్గొననుండగా, ప్రత్యేక ప్రదర్శనలు ఉంటాయని వెల్లడించారు.

మున్సిపల్ ఉద్యోగుల ఫోరమ్ వినతి

ఖమ్మంమయూరిసెంటర్: మున్సిపాలిటీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై టీజీవోస్, టీఎన్జీవోస్ రాష్ట్ర నేతలకు ఖమ్మం జిల్లా మున్సిపల్ ఉద్యోగుల ఫోరం బాధ్యులు విన్నవించారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీష్‌ను నూతనంగా ఎన్నికైన ఖమ్మం జిల్లా మున్సిపల్ ఉద్యోగుల ఫోరమ్ బాధ్యులు కలిసి సమస్యలను వివరించారు. ఈకార్యక్రమంలోఫోరమ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.సుధాకర్, జి.శ్రీనివాసరావులతో పాటు బుర్రి నాగేశ్వరరావు, కందుకూరు సాయి హేమంత్, ప్రేమ్‌రెడ్డి, అవినాష్ తదితరులు ఉన్నారు.



ఈర్లపూడి వద్ద గుట్టభూమిలో సాగు చేసిన బంతి తోట

పూల సోయగం

సంప్రదాయ పంటల స్థానంలో బంతి సాగు

- బతుకమ్మ, దీపావళి పండుగలకు లాభాలపై ఆశలు
- నమ్మకంగా ముందుకు 'సాగు'తున్న రైతులు

సండే స్పెషల్

ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం: బతుకమ్మ పండుగ రానే వచ్చింది. ఈ పండుగ జరుపుకునేందుకు పూలే కీలకం కావడంతో పూల సాగుపై దృష్టి సారిస్తున్నారు. అయితే, స్థానికంగా పూల లభ్యత లేకపోతే వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేస్తే సహజంగానే ధరలు పెరుగుతాయి. ఇదే సమయాన సంప్రదాయ పంటలతో నష్టాలు ఎదుర్కొన్న రైతులు పూల సాగుపై ప్రాధాన్యం ఇస్తున్నారు. ఖమ్మం నియోజకవర్గంలోని పలువురు రైతులు గుట్ట భూముల్లోనూ పూలు పండించడంపై దృష్టి సారించి ఇప్పుడిప్పుడే లాభాల బాట పడుతున్నారు.

వాణిజ్య పంటలకు బదులు

ఇన్నాళ్లుఇక్కడి రైతులు వాణిజ్య పంటలే సాగు చేశారు. అయితే, పెరుగుతున్న తెగుళ్లు, మారుతున్న వాతావరణంతో దిగుబడి పడిపోయి లాభాల మాటేమో కానీ పెట్టుబడి కూడా రావడం లేదు. దీంతో పూలు, కూరగాయలు, పండ్ల తోటల సాగు వైపు అడుగులు వేస్తున్నారు. ఫలితంగా తక్కువ పెట్టుబడి.. తక్కువ సమయంలోనే ఫలం చేతికందుతోందని చెబుతున్నారు. పూలు సాగు చేస్తున్న రైతులు బతుకమ్మ, దసరా, దీపావళి పండుగల సీజన్‌లో మంచి ఆదాయం వస్తుందనే ఆశతో ఉన్నారు.

రోజూ అర క్వింటా దిగుబడి



గతంలో పత్తి, తదితర పంటలు సాగు చేసేవాడిని. కానీ చీడపీడలతో దిగుబడి రాక... ఆశించిన ధర లేక ఆర్థికంగా నష్టపోయా. దీంతో మార్కెటింగ్, లాభాలు ఉంటాయనే ఆశతో బంతి పూలు సాగు చేస్తున్నా. ఇప్పటి వరకు అనుకూలంగానే ఉంది. గత రెండు రోజుల నుంచి అర క్వింటా చొప్పున దిగుబడి వస్తుంది. కొందరు పొలం వద్దే కొంటుండగా.. మిగతా పూలు మార్కెట్ తీసుకెళ్లి అమ్ముతున్నా.

– చలమల హనుమంతురావు, రైతు

ఎక్కడికక్కడే అమ్మకం

ఖమ్మం నగరం చుట్టుపక్కలే కాక కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామాల రైతులతో పాటు రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామాల రైతులు వివిధ రకాల బంతిపూల సాగు వైపు దృష్టి మళ్లించారు. రఘునాథపాలెం మండలం ఈర్లపూడికి చెందిన రైతు చలమల హనుమంతరావు గుట్ట భూమి 30 కుంటల్లో పసుపు, ఎరుపు రంగుల బంతిపూలు సాగు చేశారు. ఇప్పటికే పంట కోతకు సిద్ధమైంది. గత రెండు రోజులుగా రోజుకు అర క్వింటా చొప్పున చేతికొస్తోంది. ఒకటి, రెండు కిలోలు కొనుగోలు చేసే వారు కిలోకు రూ.60 – రూ.70 చెల్లిస్తుండగా, 50 కేజీలకు పైగా దాటితే రూ.50తో విక్రయిస్తున్నారు. 30 కుంటల భూమిలో పూల సాగు చేయడానికి సుమారు రూ.30 వేల పైగా ఖర్చయిందని.. కుటుంబ సభ్యులంతా తోటను సంరక్షిస్తుండగా బతుకమ్మ సీజన్‌లో మంచి ఆదాయం వస్తుందనే నమ్మకంతో ఉన్నట్లు హనుమంతరావు తెలిపారు. ఇక నియోజకవర్గంలోని బల్లేపల్లి, అల్లీపురం, బాలపేట, రఘునాథపాలెం, బూడిదంపాడు, మంచుకొండ, వీ.వీ.పాలెం, ఈర్లపూడి తదితర గ్రామాల రైతులు సైతం డిమాండ్ దృష్ట్యా బంతిపూల సాగుపై మక్కువ చూపుతున్నారు. అయితే, రైతులకు ప్రభుత్వం నారు సరఫరా చేయడమే కాక మార్కెటింగ్‌లో సహకరిస్తే మరింత మంది ముందుకొచ్చే అవకాశముంటుందని చెబుతున్నారు.



వీవీపాలెంలో బంతి సాగు

పొలాలకు దారులు ఏర్పాటు చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: గ్రామాల్లోని ప్రతీ రైతు పొలానికి వెళ్లేలా దారులు ఏర్పాటు చేయాలని దక్షిణ భారత ప్రాంతీయ సంఘటన మంత్రి(ఆర్ఎస్ఎస్) ధోనూరు రాము డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మంలో జరిగిన జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆక్రమణలో ఉన్న డొంకలను సరిచేసి దారుల కల్పించాలి డిమాండ్ చేశారు. తర్వాత బీకేఎస్ తెలంగాణ రాష్ట్ర సంఘటన మంత్రి(ఆర్ఎస్ఎస్) రాజిరెడ్డి మాట్లాడుతూ.. రైతులకు సకాలంలో విత్తనాలతో పాటు ఎరువులు అందించాలని, సాగునీటి కాల్వలకు మరమ్మతులు చేయించి ప్రతీ ఎకరాకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో బీకేఎస్ జోనల్ అధ్యక్షుడు మల్లెంపాటి రమేష్, కార్యదర్శి మందనపు రామారావు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, కార్యదర్శి తాళ్లూరి శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాము

పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో పారిశుద్ధ్యాన్ని మరింతగా మెరుగుపర్చాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. శనివారం నగరంలోని 53, 46, 47, 48, 5వ డివిజన్లలో పారిశుద్ధ్య పనులను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్లు, డివైడర్ల వెంట మట్టి, దుమ్ము లేకుండా శుభ్రం చేయాలని, శానిటరీ సిబ్బంది, జవాన్లు సెలవులకు డిప్యూటీ కమిషనర్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్, శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్య తదితరులు ఉన్నారు.

ఉద్యోగ భద్రత, సంక్షేమమే లక్ష్యం

ఖమ్మంమయూరిసెంటర్: మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో పనిచేస్తున్న స్టాఫ్, ఔట్ సోర్సింగ్ వర్కర్ల ఉద్యోగ భద్రత, సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) పనిచేస్తుందని రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి తెలిపారు. యూనియన్ మూడవ జిల్లా మహాసభలు శనివారం ఖమ్మంలోని అంబేద్కర్ భవన్‌లో జరిగాయి. అంతకు ముందు జెడ్పీసెంటర్ నుంచి అంబేద్కర్ భవన్ వరకు మున్సిపల్ కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. మహాసభల ప్రారంభ సూచికంగా ఏఐటీయూసీరాష్ట్ర కార్యవర్గ సభ్యులు బీ.జీ.క్లెమెంట్ ఏఐటీయూసీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఊడల కృష్ణ, తాటి నాగేంద్రబాబు అధ్యక్షవర్గంగా వ్యవహరించిన ఈ సమావేశంలో జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు నెలకు రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వైరాలో స్పెషల్ డ్రైవ్ కింద తీసుకున్న 55 మందికి మున్సిపల్ చట్టాలను వర్తింపజేయాలని కోరారు. అనంతరం 43 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ మహాసభల్లో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు, సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాదె లక్ష్మీనారాయణ, తోట రామాంజనేయులు, కార్యనిర్వాహక అధ్యక్షుడు రావి శివరామకృష్ణ, నాయకులు వేము రాంబాబు, గారపాటి అశోక్, సీహెచ్ వెంకటేశ్వరరావు, కృష్ణ, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న జైపాల్‌రెడ్డి

అనాథ శవానికి అంత్యక్రియలు

ఖమ్మంవైద్యవిభాగం: ఇటీవల ఖమ్మం రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని యువకుడు రైలు కిందపడి మృతి చెందగా మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. అయితే మృతదేహం కోసం ఎవ్వరూ రాకపోవడంతో అనాథశవంగా భావించి అన్నం సేవా ఫౌండేషన్‌కు సమాచారం ఇచ్చారు. రైల్వే పోలీసులు, ఆస్పత్రి సిబ్బంది సమక్షంలో శనివారం బల్లేపల్లి వైకుంఠధామంలో మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బారసాల వేడుకలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని అన్నం ఫౌండేషన్‌లో శనివారం డీఎంహెచ్ఓ డాక్టర్ కళావతిబాయి, ఐసీడీఎస్ అధికారుల సమక్షంలో అనాథ మహిళకు జన్మించిన బాలుడికి బారసాల వేడుకలు నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలంలోని ఒక గ్రామంలో మానసిక స్థితి సరిగా లేని ఆదివాసీ యువతికి బాలుడు జన్మించినట్లు నిర్వాహకులు తెలిపారు. అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు, కార్పొరేటర్ జాన్‌బీనాగుల్ మీరా, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం నగరంలోని త్రీటౌన్‌లో గల గుమస్తాల సంఘం భవనంలో కార్పొరేటర్ యర్రా గోపి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సైడ్ డ్రైయిన్, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రోడ్ల విస్తరణ, కోతులు, కుక్కలు తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బండారు రమేష్, త్రీటౌన్ కార్యదర్శి భూక్యా శ్రీనివాసరావు, త్రీటౌన్ కార్యదర్శివర్గ సభ్యులు పత్తిపాక నాగసులోచన, యర్రా రంజిత్, ఎస్‌కె.ఇమామ్, బండారు వీరబాబు, శీలం వీరబాబు, ఎస్‌కె.సైదులు, యర్రా మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపులు సరికాదు

ఖమ్మంమయూరిసెంటర్: ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు అడిగితే ఆస్పత్రుల్లో తనిఖీలు, కళాశాలల యాజమాన్యాలను బెదిరించి భయభ్రాంతులకు గురి చేయడం సిగ్గుచేటని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆవుల అశోక్ అన్నారు. శనివారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు సమ్మెకు పూనుకున్న ప్రభుత్వం పట్టించుకోకుండా తనిఖీ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. వెంటనే బకాయిలు విడుదల చేసి, ప్రజలను దోచుకుంటున్న ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఝాన్సీ, నగర కార్యదర్శి శోభ, నాయకులు సత్తార్, అశోక్, సుజాత, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పెంచాలి

ఖమ్మం మామిళ్లగూడెం/రఘునాథపాలెం: పెన్షన్‌దారులు, దివ్యాంగులకు పింఛన్ పెంచాలని కోరుతూ శనివారం కేఎంసీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి అసిస్టెంట్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వికలాంగులు, ఖమ్మం జిల్లా నాయకులు రేళ్ల పుల్లమ్మ, ఉపేందర్, భూలక్ష్మి మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు వికలాంగులకు 6వేలు, సమస్త చేయూత పెన్షన్‌దారులకు రూ.4వేల పెన్షన్ పెంచాలని డిమాండ్ చేశారు. తంగిరాల సీతమ్మ, రాయబారపు దుర్గ, చాగంటి తిరపయ్య, కొమ్ము భద్రయ్య, సూరారపు ఉమ, అంజయ్య, రామన్న, శ్రీను, మరికంటి శేఖర్, కీసరనాగరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే పెన్షన్ హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం రఘునాథపాలెం, మంచుకొండ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ రఘునాథపాలెం మండల అధ్యక్షుడు మంద గోపాల్‌రావు ఆధ్వర్యాన అధికారికి వినతిపత్రం అందజేశారు. పెన్షన్‌దారులు పిచ్చయ్య, గురవయ్య, భాస్కర్, సైదులు, రామకృష్ణ, బాలమ్మ, లింగయ్య, చంటి తదితరులు పాల్గొన్నారు.

తపాలా శాఖ స్వచ్ఛోత్సవ్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు

ఖమ్మంగాంధీచౌక్: సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం నగరంలో తపాలా శాఖ ఆధ్వర్యాన స్వచ్ఛోత్సవ్ ర్యాలీ నిర్వహించారు. ఖమ్మం డివిజన్ తపాల కార్యాలయం గాంధీచౌక్ నుంచి ప్రారంభమైన ర్యాలీలో 'క్లీన్ ఇండియా– గ్రీన్ ఇండియా', స్వచ్ఛ భారత్– స్వచ్ఛ ఖమ్మం', ప్లాస్టిక్ వాడొద్దని రూపొందించిన ప్లకార్డులతో నినాదాలు చేశారు. డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ వి.వీరభద్రస్వామి, అధికారులు, పోస్టుమాస్టర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు

ఖమ్మం మామిళ్లగూడెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ మైనారిటీ, మహిళా యోజన, రేవంతన్న కా సహారా పథకాలు శుభసూచకమని దూదేకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బడే సాహెబ్ అన్నారు. శనివారం ఖమ్మంలోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘం ప్రతినిధులు షేక్ మీరా, అన్వర్ పాషా, మీరాసాహెబ్, మౌలాలి, సుభానిబాబు, నాగసైదులు, సిద్ధిక్, రంజాన్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక

ఖమ్మం రాపర్తినగర్: నగరంలోని టేకులపల్లి మోడల్ కెరీర్ సెంటర్‌లో జిల్లా ఉపాధి కల్పనశాఖ ఆధ్వర్యాన శనివారం జరిగిన జాబ్ మేళాలో 8 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంఎస్ఎన్ లాబొరేటరీస్ నిర్వహించిన ఈ మేళాకు 25 మంది హాజరు కాగా 8 మందికి నియామక పత్రాలు అందజేశారు. జిల్లా అధికారి కొండపల్లి శ్రీరాం, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సేవలు విస్తృతపర్చాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ సేవలు విస్తృత పరచాలని ఆ సంస్థ చైర్మన్ డాక్టర్ వి.చంద్రమోహన్ కోరారు. శనివారం ఖమ్మం సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ప్రతీనెల ఒక బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించాలని, 10 మంది సభ్యులను సంఘంలో చేర్చాలని పలు తీర్మానాలు చేశారు. సంస్థ బాధ్యులు ఆర్.రవీందర్ రావు, గుడిమళ్ల సూర్య ప్రకాశరావు, సాధినేని జనార్దన్‌రావు, నరసయ్య, శ్రీహరి పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీలు

ఖమ్మంఅర్బన్: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ నాయకుడు కుమిలి శ్రీనివాసరావు ఆధ్వర్యాన రోటరీనగర్ ప్రభుత్వ పాఠశాలలో 'పెహల్గాం ఆపరేషన్ సిందూర్'అంశంపై శనివారం చిత్రలేఖన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, అర్బన్ అధ్యక్షులు రామకృష్ణ, సుదర్శన్ మిశ్రా, ప్రవీణ్, అంజన్న, మణి, నీలిమ, రజనీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బూట్లు, సాక్సులు..

తిరుమలాయపాలెం: మండల పరిధిలోని పిండిప్రోలు ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన అందించిన బూట్లు, సాక్సులను ఆత్మకమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, తిరుమలాయపాలెంలో మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్ పంపిణీ చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచనల మేరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. మాజీ ఎంపీపీ బోడ మంగీలాల్, నాయకులు గుగ్గిళ్ల అంబేద్కర్, షేక్.సైఫుద్దీన్ చామకూరి శ్రీనివాస్, దొడ్డ గురవయ్య, షేక్ సలీం, రావూరి యాకూబ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్



పరీక్షకు హాజరైన అభ్యర్థులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని పుట్టకోటలో ఉన్న ఖమ్మం ఫార్మసీ కాలేజీలో శనివారం డీవీస్ ల్యాబొరేటరీస్, హైదరాబాద్ ఆధ్వర్యాన క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ నిర్వహించినట్లు కాలేజీ కరస్పాండెంట్ పొట్ల ఏసయ్య తెలిపారు. మొత్తం 80 మంది విద్యార్థులు పాల్గొనగా.. 70 మంది అర్హత సాధించారన్నారు. వీరిని కళాశాల సెక్రటరీతో పాటు ప్రిన్సిపాల్ బోడావుల సాంబశివరావు, హెచ్ఓడీ సామినేని చంద్రశేఖరరావు అభినందించారు.

ప్రవక్త జీవితం మార్గదర్శకం

ఖమ్మం మామిళ్లగూడెం: మహమ్మద్ ప్రవక్త జీవితం ప్రపంచ మానవాళికి మార్గదర్శకమని జమాతే ఇస్లామీ హింద్ ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు అస్మా అంజుమ్ అన్నారు. శనివారం ఇందిరానగర్ నార్త్ శాఖ కార్యాలయంలో మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రవక్త సందేశ ప్రచార ఉద్యమంలో భాగంగా నిర్వహించిన మహిళా పండితుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నార్త్ అధ్యక్షురాలు హుస్సేన్‌బి, ఖమ్మం సెంట్రల్ అధ్యక్షురాలు అస్ఫియ అంజుమ్, ఖమ్మం సౌత్ అధ్యక్షురాలు నాజియా తబస్సుమ్, జమాత్ సభ్యులు ఆరిఫా, హబీబా, సాలే హ తస్లీమ్, జహరా ఫాతిమా, సబిహ, ఫాతిమా, తబస్సుం, ఆస్మా, నసీమా, శంసున్నిసా, మహిళా ఇస్లామియా పండితులు, పాల్గొన్నారు.

పకడ్బందీగా యూరియా పంపిణీ

రఘునాథపాలెం: మండలంలోని వివిధ సొసైటీల పరిధిలో శనివారం పోలీసుల పహారా మధ్య రైతులకు యూరియా పంపిణీ చేశారు. వీ.వీ.పాలెం సొసైటీలో 225 బస్తాలు, మంచుకొండ సొసైటీ పరిధిలో మంచుకొండ కేంద్రంలో 225 బస్తాలు, చిమ్మపూడి సబ్‌సెంటర్‌లో 555 కట్టలు పంపిణీ చేసినట్లు సీఈఓలు తిరుపతిరావు,శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆయా కేంద్రాల వద్ద సీఐ ఉస్మాన్ షరీఫ్ ఆధ్వర్యాన బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని వైరారోడ్ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా ఆదివారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు, ఎన్ఎస్‌టీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-1 ఏడీఈ నాగార్జున శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

మహాసభలకు ఖమ్మం ప్రతినిధులు

ఖమ్మం మామిళ్లగూడెం: పంజాబ్‌లోని మొహాలీలో ఐదురోజుల పాటు జరుగుతున్న భారత కమ్యూనిస్టు పార్టీ 25వ మహాసభలకు ఖమ్మం జిల్లా ప్రతినిధి వర్గం శనివారం బయలుదేరారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు నేతృత్వాన సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఎస్‌కె.జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు వెళ్లారు.

సర్వసభ్య సమావేశం

ఖమ్మం సహకారనగర్: ఏపీటీఎఫ్ హౌస్ బిల్డింగ్‌కు సంబంధించిన సమస్యను పరిష్కరించినట్లు సొసైటీ అధ్యక్షుడు తాళ్లూరి వేణు, ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయుల కోసం హౌస్ బిల్డింగ్ సొసైటీని ఏర్పాటు చేసుకోగా.. ఏపీటీఎఫ్ టీపీటీఎఫ్‌గా మారిన తదుపరి అనివార్యంగా సొసైటీ రద్దయిందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సొసైటీ సభ్యుల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించగా.. హౌస్ బిల్డింగ్ సొసైటీ పూర్వపరాలను చర్చించి ఆర్థిక లావాదేవీలను పరిష్కరించినట్లు తెలిపారు.

పూల పండగకు వేళాయె..

పూల పండుగ బతుకమ్మ వేడుకలకు వేళయింది. తొమ్మిది రోజులపాటు బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు మహిళలు సిద్ధం అవుతున్నారు. ఆదివారం ఎంగిలిపూల బతుకమ్మ ప్రారంభం కానున్న నేపథ్యాన శనివారం మార్కెట్‌లోకి వచ్చిన పూలను బట్టి ధరలు పలికాయి. కాగా, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలను సంప్రదాయ పద్ధతిలో నిర్వహించి, పండగ ప్రాధాన్యతను విద్యాసంస్థల బాధ్యులు వివరించారు. – సాక్షి నెట్‌వర్క్



బంతి పూలు కొనుగోలు చేస్తున్న మహిళ



ఖమ్మంసహకారనగర్: ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు



కామేపల్లి: టేకులతండాలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



ఖమ్మం సహకారనగర్: బతుకమ్మలతో స్మార్ట్‌కిడ్జ్ పాఠశాల డైరెక్టర్ చింతనిప్ప సుకన్య, సిబ్బంది



ఖమ్మం సహకారనగర్: రెజొనెన్స్ శ్రీనగర్ పాఠశాలలో బతుకమ్మలతో డైరెక్టర్లు శ్రీధర్‌రావు, కృష్ణవేణి



ఖమ్మం సహకారనగర్: సర్వజ్ఞ పాఠశాలలో..



నేలకొండపల్లి: బోదులబండలో..



ఖమ్మంరూరల్: గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో..



ఖమ్మంక్రైం: బతుకమ్మను తీసుకొస్తున్న శ్రీకృష్ణ ప్రసాద్ మెమోరియల్ స్కూల్ చైర్‌పర్సన్ నిష్టాశర్మ



కూసుమంచి: జీళ్లచెరువు పాఠశాలలో..



తిరుమలాయపాలెం పాఠశాలలో..



ఖమ్మంలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు